## పది రోజుల్లో పట్టా పాస్‌బుక్ వచ్చింది



హనుమకొండ సిటీ : ఏళ్ల నుంచి మా పేర కానీ భూమి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి ద్వారా సులువైంది. ధరణిలో దరఖాస్తు చేసుకున్న పది రోజుల్లోనే పాస్‌బుక్ వచ్చింది. అలాంటి మంచి కార్యక్రమాన్ని కాంగ్రెస్ తీసేస్తామనడం మూర్ఖత్వం. 30 ఏళ్ల క్రితం మా నాయిన ఉట్టి కాగితం రాయించుకుని ఎకరం 10 గుంటలు కొన్నాడు. పట్టెదారుని పేరుమీదనే ఇన్ని రోజులు భూమి ఉండేది. అయితే ధరణి వచ్చిన తర్వాత ఎలాంటి ముడుపులు చెల్లించకుండానే పది రోజుల్లో మా పేర పాస్‌బుక్ వచ్చింది. గతంలో కాళ్లరిగేలా తిరిగినా పనులు కాకపోయేది. ఎనకటి పద్ధతులు తీసుకొస్తే రైతన్నలు తలకాయలు పగలగొట్టుకోవడం ఖాయం.

**- వంగ శివకుమార్ రైతు, యాదవనగర్**

## కాంగ్రెస్‌ను నమ్మితే కష్టాలు తప్పవు



హనుమకొండ : కాంగ్రెస్ పార్టీని నమ్మితే మళ్ల కరెంటు కష్టాలు తప్పవు. గతంలో వారి పాలనలో కరెంటు కోసం ఎన్నో కష్టాలు పడ్డాం. అసలు రేవంత్‌రెడ్డికి వ్యవసాయం గురించి తెలిస్తే 3 గంటల కరెంటు చాలు అని అనడు. అర కోర రాత్రి పూట కరెంటుతో ఎంతో మంది చనిపోయి వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఆ కుటుంబాలను అప్పటి కాంగ్రెస్ ఆదుకోలేదు. ఆ పార్టీ మళ్లీ వస్తే భూముల కోసం అధికారులు, దళారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. సంతోషంగా బతుకుతున్న వారిని ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారు. అందుకే ధరణి తీసేస్తం అంటున్నారు. ధరణి, 24 గంటల కరెంటు ఉండాల్సిందే. అందుకే మళ్లా కేసీఆర్ సీఎం కావాలి.

**- భట్టు ఆదాం, రైతు, మల్లికుదుర్ల, వేలేరు మండలం**



## మళ్లీ సీఎం కేసీఆర్ రావాలే..



న్యూశాయంపేట : రైతుల తిప్పలు పోగొట్టడానికి సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తెచ్చిండు. కేసీఆర్ మానిఫెస్టోలో చెప్పినట్టే రైతుల బాధలు తీర్చిండు. ధరణి వచ్చినకం వ్యవసాయ భూములు వివరాలు మొత్తం ఆన్‌లైన్‌లోకి వచ్చినయ్. నాలుగు ఓట్లు రానోళ్లు కుడా మాట్లాడవట్టే. దీనిని ప్రజలు నమ్మరు. కాంగ్రేసోళ్లు ధరణి వద్దంటున్నారు. రైతుల భూములు మల్లా ఆగమైతయ్. బీఆర్ఎస్ రావాలి, కొట్లాడి తెచ్చిన తెలంగాణకు మళ్లీ కేసీఆరే సీఎం కావాలి.

**– వేల్పుల విజేందర్,న్యూశాయంపేట**

## కాంగ్రెస్‌ను అసలు నమ్మవద్దు..



హనుమకొండ చౌరస్తా : కాంగ్రెస్ కాలంలో రైతులు ఎన్నో కష్టాలు పడ్డారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ కష్టాలు మొదలైతయి. వారి మాటలు అసలు నమ్మవద్దు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి. రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ మంచి ఆలోచన చేశాడు. కాంగ్రెస్ ఇస్తామన్న మూడు గంటల కరెంటు అసలు సరిపోదు. ఈ పదేళ్లలో ఒక్కసారి కూడా కరెంట్ కోసం ఇబ్బందులు పడలేదు. రైతులు బాగుపడాలని ఎన్నో పథకాలు తీసుకువచ్చిన కేసీఆరే మళ్లీ సీఎం అవుతాడు.

**– పీ శ్వేతారెడ్డి, హౌసింగ్‌బోర్డుకాలనీ, హనుమకొండ**

## రైతుల ఉసురు తీయడానికే..



హనుమకొండ సిటీ : రాష్ట్రం పచ్చగా కనిపిస్తుంటే కాంగ్రెసోళ్లకు నిద్రపడతలేదు. ఎటు చేసి రాష్ట్రాన్ని వల్లకాడు చేసి బీఆర్ఎస్ ప్రభుత్వంపై అక్కసు తీర్చుకోవాలని చూస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన కరెంట్‌తో రైతులు ఒక్కరే కాదు మాలాంటి చిరువ్యాపారులతో ప్రతి వర్గం నానా యాతనపడ్డారు. ప్రస్తుతం కేసీఆర్ 24 గంటలు కరెంటు ఇస్తుంటే ఓర్వలేని కాంగ్రెస్ 3 గంటలు ఇచ్చి రైతులు ఉసురు తీస్తానంటుంది.

**– పీరమాదేవి, సమోసా తయారీదారు, హనుమకొండ**

## కేసీఆర్‌కే 24 గంటల కరెంట్ సాధ్యం..



హనుమకొండ చౌరస్తా : 24 గంటల కరెంటు ఇవ్వడం ఒక్క కేసీఆర్‌కే సాధ్యం. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చే మూడు గంటల కరెంటు ఒక అర ఎకరానికి కూడా సరిపోదు. 10 హెచ్‌పీ మోటార్లను పెట్టి నీళ్లు ఇవ్వడం అంటే ఐదు రూపాల ఖర్చుకు పది రూపాలు పెట్టడమే. ధరణి వల్ల ఇవాళ ఒక్క గుంట కూడా పోనీ పరిస్థితి కేసీఆర్ కల్పించారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి పట్టాలు వచ్చేలా చేసినే కేసీఆరే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

**– కలకోట్ల జయరాం, వ్యాపారి**

## ధరణిని తీసేస్తే అంతా ఆగమే..



కాజీపేట : సీఎం కేసీఆర్ పెట్టిన ధరణి, రైతుబంధుతో మంచిగుంటున్నం. కావాలని ధరణిని కాంగ్రెసోళ్లు తీసేస్తే అంతా ఆగమైతది. ధరణి వల్లనే అదునుకు పెట్టుబడి సాయం అందుతుంది. దాన్ని తీసేస్తే మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ వచ్చిపడ్తది. కష్టపడి సంపాదించుకున్న డబ్బులతో భూములు కొనుకున్నోళ్లు ఆగమైతరు. కౌలు రైతుల పేర్లు రికార్డులకు ఎక్కిస్తే అసలు యజమానులకు ఎసరొస్తంది. దీంతో రైతుల మధ్య గొడవలు వస్తాయి. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రైతులంతా కష్టాల పాలవుతారు. రైతులందరూ వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కే మద్దతు ఇవ్వాలె.

**– చౌనబోయిన కమల్‌హాసన్ రైతు, మడికొండ**

# పోలింగ్ కేంద్రాల్లో సర్వం సిద్ధం

- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్**
- **ఎనుమాములలో ఈవీఎంల పంపిణీ**




ఎనుమాముల నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్



డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రిని సరి చూసుకుంటున్న పోలింగ్ సిబ్బంది



పోలింగ్ సామగ్రిని చూపిస్తున్న సిబ్బంది

హనుమకొండ, నవంబర్ 29 : హనుమకొండ జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో గురువారం జరుగనున్న పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. వరంగల్ ఎనుమాములలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల ఈవీఎంల పంపిణీని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అంతా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రెండు నియోజకవర్గాల్లో ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈవీఎంలతోపాటు ఇతర పోలింగ్ సామగ్రిని కట్టుదిట్టమైన భద్రత మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. కాగా, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ ఈవీఎంలు ఇతర పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ విధులకు వెళ్లే అధికారులు, సిబ్బంది వివరాలను జనరల్ అబ్జర్వర్ డాక్టర్ హెచ్‌ఎన్ గోపాలకృష్ణ, పోలీస్ అబ్జర్వర్ తోగో కర్గా, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ అధికారులు సిబ్బందితో మాట్లాడారు. ఈవీఎంల డెమోను పరిశీలించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, పోలింగ్ అధికారులు, అదనపు అధికారులు, ఇతర అధికారులకు కలెక్టర్ పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈవీఎంలు, పోలింగ్ సామగ్రిని కేంద్రాలకు తరలించే వాహనాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎనుమాములలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంతో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజన సదుపాయాలను పరిశీలించారు. కాగా, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్ల గురించి పోలీస్ అధికారులు సిబ్బందికి సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీ పలు సూచనలు ఇచ్చారు. వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు ఎన్నికల సామగ్రితో వెళ్తున్న సిబ్బంది వాహనాల ఎదుట జనరల్ అబ్జర్వర్ హెచ్ ఎన్ గోపాలకృష్ణ, కలెక్టర్ సిక్తా పట్నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, రిటర్నింగ్ అధికారులు రమేశ్, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

**ఓటు హక్కును వినియోగించుకోవాలి**

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటేసేందుకు వచ్చే ఓటర్లకు తాగునీరు, తదితర సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లాలో పలు కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్యంగా యువత ఓటు హక్కును వినియోగించుకునే విధంగా స్వీప్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో 484 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్, మీడియా కంట్రోల్ రూమ్, వెబ్ కాస్టింగ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్




కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్‌ను పరిశీలిస్తున్న సిక్తా పట్నాయక్

హనుమకొండ, నవంబర్ 29: జిల్లాలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం సాయంత్రం సందర్శించారు. కాజీపేటలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యూత్ మేనేజ్ పోలింగ్ కేంద్రాన్ని, గోపాల్‌పూర్‌లో బేబీ సైనిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉమెన్స్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ కల్పించిన వసతులను ఆమె పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్లు సిక్తా పట్నాయక్ తెలిపారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్, నీటి వసతి, వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంపులను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు స్వాగతం పలికేలా బెలూన్లతో ఆకట్టుకునేలా ముస్తాబు చేశారు. ఓటేసేందుకు వచ్చే యువ ఓటర్లకు పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్ల గురించి అధికారులు, పోలీసులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లపై ఎన్నికల సిబ్బందిని అభినందించారు.

**వెబ్ కాస్టింగ్ ప్రక్రియ పరిశీలన**

అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన పోలింగ్ రోజున వెబ్ కాస్టింగ్ సక్రమంగా, సంపూర్ణంగా జరిగేలా సంబంధిత బాధ్యులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదేశించారు. గురువారం ఉదయం ప్రారంభం కానున్న పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షణ కోసం హనుమకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ ఏర్పాట్లు వంద శాతం పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల వాహనాల్లోని జీపీఎస్ ట్రాకింగ్, సర్వైలెన్స్ ప్రక్రియ, పోలింగ్ సిబ్బంది, వారి విధుల నిర్వహణలో సంబంధిత నోడల్ అధికారులు పూర్తి అలర్ట్‌గా ఉండాలన్నారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన నివేదికలను సమయానుసారంగా పంపించాలని కలెక్టర్ సూచించారు.